సాక్షి
అనకాపల్లి
సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. స్వర్ణ పుష్పాలతో పూజించారు.



శ్రావణలక్ష్మి పూజలు

విశాఖ: కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు ఆదివారం 18వ రోజుకు చేరాయి.



ఇలా అయితే విజయం మీదే..

వైవిధ్యమైన ఆలోచనకు సృజనాత్మకత జోడిస్తే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని విద్యావేత్తలు సూచించారు. 8లో

న్యూస్‌రీల్

మంత్రి అమర్‌నాథ్‌కు సత్కారం



మిందిలో మంత్రి అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న గంగవరం పోర్టు కార్మికులు

అక్కిరెడ్డిపాలెం (విశాఖ): గంగవరం పోర్టు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కార్మికులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సత్కరించారు. మిందిలోని మంత్రి నివాసంలో కార్మికులు అమర్‌నాథ్‌ను కలిసి యాజమాన్యం ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు తిప్పల గురుమూర్తి రెడ్డి, జెర్రిపోతుల ముత్యాలు, కసిరెడ్డి సత్యనారాయణ, చీకటి అప్పారావు, పోర్టు నిర్వాసిత ఉద్యోగులు జి.అమ్మోరు, నొల్లి తాతారావు, కదిరి సత్యారావు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

సంగీత నృత్యోత్సవంతో విశాఖకు కీర్తి



టి.ఎం.కృష్ణ గాత్ర కచేరి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న సంగీత నృత్యోత్సవంతో విశాఖ కీర్తి మరింత ఇనుమడింపచేశారని రియల్ అడ్మిరల్ విజయశేఖర్ అన్నారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో రెండో రోజు కార్యక్రమానికి రియల్ అడ్మిరల్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణరాజు, డాక్టర్. వి.ఆర్.కె.రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం రియల్ అడ్మిరల్ విజయశేఖర్ మాట్లాడుతూ సంగీత ప్రియులు, నాట్య అభిమానులు, నాటక ప్రియులు వారం రోజుల పండగ చేసుకునేలా ఎంతో ఘనంగా వేడుకలను నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం టి.ఎం.కృష్ణ గాత్ర కచేరి ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. కచేరికి ప్రసిద్ధ వయోలిన్ విద్వాంసుడు హెచ్.ఎస్.భాస్కర్, మృదంగంపై డాక్టర్ వంకాయల వెంకటరమణ సహకారం అందించారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సత్కారం



ఉమాగాంధీని సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్ (విశాఖ): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన శివాజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ఎం.ఉమాగాంధీని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు ఆదివారం ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం తరపున గిడుగు అవార్డుకు ఎంపికై సత్కారం పొందిన మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని ఎ.హైమావతి, విశ్రాంత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుప్పిలి లక్ష్మీవరప్రసాద్‌ను మహిళలు ఘనంగా సత్కరించారు.

లలితా పీఠానికి పోటెత్తిన భక్తులు



లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సీతంపేట (విశాఖ): అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. చాతుర్మాస దీక్షలో ఉన్న కుర్తాళ, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి వారి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. జూలై 3 నుంచి సెప్టెంబర్ 29 వరకు చాతుర్మాస దీక్షలు చేపట్టడంతో స్వామీజీ లలితా పీఠంలో భక్తులకు అందుబాటులో ఉంటున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులను దర్బారు హాల్లో కూర్చోబెట్టి ఒకరి తర్వాత మరొకరిని దర్శనానికి అనుమతించారు.

ఉత్తమ గురువులకు పురస్కార వందనం

- రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ముగ్గురు ఎంపిక
- బోధన, సేవారంగాల్లో విశేష కృషి
- విద్యార్థుల అభ్యున్నతే అంతిమ లక్ష్యంగా సేవలు

జిల్లాలో ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. దేవరాపల్లి మండలం కాశీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్న కొట్టాన రాంబాబు, చీడికాడ మండలం మంచాల మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ చరకాపు వెంకటలక్ష్మి, అచ్యుతాపురం మండలం నునపర్తి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న కేజియారాణి ఈ అవార్డులు అందుకోనున్నారు. వీరు ఉత్తమ బోధన అందించడంతో పాటు, విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తూ అందరి మన్ననలు పొందారు.

ఇటు బోధన.. అటు సామాజిక సేవ

దేవరాపల్లి: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన దేవరాపల్లి మండలం కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోషల్ టీచర్ (స్కూల్ అసిస్టెంట్) కొట్టాన రాంబాబు నాగయ్యపేట గ్రామానికి చెందిన వారు. ఇటు ఉపాధ్యాయుడిగా అటు సామాజిక, సేవా కార్యక్రమాలలో విశేష సేవలందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఉపాధ్యాయుడిగా తాను ఎక్కడ పనిచేసినా సామాజిక బాధ్యతగా మొక్కలు నాటడం అలవాటుగా మార్చుకున్నారు. ప్రతిభ చూపే విద్యార్థులకు తన తండ్రి పేరిట ఐదేళ్లగా సన్ని అవార్డులను అందజేస్తూ ప్రోత్సహిస్తున్నారు. కేరళ, కోనసీమ వరద బాధితులు, గుజరాత్ భూకంపం బాధితులు, సునామీ బాధితుల కోసం విరాళాలు సేకరించి అందజేశారు. సామాజిక వేత్తగా, కవిగా, రచయితగా విభిన్న కోణాల్లో తనకున్న అనుభవంతో ఆయా రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. సందేశాత్మక లఘు నాటికలు, ఏకపాత్రాభినయం వంటివి ప్రదర్శింపచేసి రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. విద్యార్థులతో బోధనోపకరణాలను తయారు చేయించి మండల స్థాయిలో రెండు సార్లు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు.



ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా సత్కారం పొందుతున్న రాంబాబు మాస్టారు

పొందిన అవార్డులు: 2009లో ప్రభుత్వం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు.సాయి శిరీషా పౌండేషన్ (విశాఖపట్నం) నుంచి గురు బ్రహ్మ అవార్డు, అమలాపురం లోత్రి రత్న బుద్ధ విహార్ సంస్థ నుంచి అంబేద్కర్ లైఫ్ అచీవ్‌మెంట్ అవార్డు, విశాఖ సమాచార పత్రిక యాజమాన్యం నుంచి ఉగాది పురస్కారం అందుకున్నారు.

ఆనందంగా ఉంది..



రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. పర్యావరణ పరిరక్షణకు సామాజిక బాధ్యతగా మొక్కలు నాటడం అలవాటుగా మార్చుకున్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ఆలవర్చుకోవాలి.

–కొట్టాన రాంబాబు మాస్టారు, కాశీపురం హైస్కూల్.



ఆగస్టు 15న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న వెంకటలక్ష్మి

మంచాల మెచ్చేలా..

చీడికాడ: మండలంలోని మంచాల మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ చరకాపు వెంకటలక్ష్మి విద్యార్థుల అభ్యున్నతి, ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా సేవలందిస్తున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఈ మోడల్ స్కూల్ పలు అవార్డులు పొందేలా కృషి చేశారు. జాతీయస్థాయి ఏటీసీ మారథాన్ 2020లో ఈ పాఠశాల విద్యార్థులు మొదటిస్థానం పొందారు. స్వీడన్ అంబసీ,నీతి అయోగ్ సంయుక్తంగా నిర్వహించిన సీ–స్టెమ్ ఛాలెంజ్‌లో సైన్సు ఉపయోగించి సమాజాన్ని అభివృద్ధి చేయడం ఎలా అనే అంశంపై జరిగిన సెమినార్‌లో మన దేశం నుంచి పాల్గొన్న రెండు పాఠశాలల్లో మంచాల మోడల్‌స్కూల్ ఒకటి. 2020–21లో రాష్ట్రస్థాయిలో జరిగిన కళా ఉత్సవాల్లో ఈ పాఠశాల విద్యార్థులు రెండుసార్లు పాల్గొని ప్రథమ,ద్వితీయ బహుమతులు గెలిపొందారు. ఈ విజయాల వెనుక వెంకటలక్ష్మి విశేష కృషి ఉంది.

సాధించిన విజయాలు: 2013లో వి.మాడుగుల మండలం నర్సయ్యపేట ట్రైబల్ వెల్ఫేర్ బాలుర ఆశ్రమ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిష్)గా వెంకటలక్ష్మి విధుల్లో చేరారు. 2013 జూన్‌లో జరిగిన ఏపీ మోడల్ స్కూల్ రిక్రూట్‌మెంట్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించి తేగాడ మోడల్‌స్కూల్‌లో విధులు చేపట్టారు.2018 మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఎంపిక టెస్టులో రాష్ట్రస్థాయిలో నాలుగవ ర్యాంకు సాధించారు.2020లో మంచాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా విధులు చేపట్టారు. 2016లో సెంట్రా అనే సంస్థ నిర్వహించిన టీపీవో టెస్టులో జాతీయ స్థాయిలో 11ర్యాంకు సాధించారు. ఉత్తమ ఫలితాల సాధన,పాఠశాల నిర్వహణలో ప్రతిభ కనబరిచినందుకు ఈ ఏడాది ఆగస్టు 15న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ గ్రీన్‌స్కూల్ అవార్డుకు ఈ పాఠశాల ఎంపిక కాగా ఈ నెల 15న న్యూయార్క్‌లో (యూఏఈ) బహుమతి స్వీకరించనున్నారు. ఈమె సీబీఎస్సీ అనకాపల్లి జిల్లా కో–ఆర్డినేటర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2020 నంబర్‌లో ఐఐఎం అహ్మదాబాద్‌లో జరిగిన ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మొదటి బ్యాచ్‌లో మెరిట్ ప్రాతిపదికన ఎంపికయ్యారు.



పాఠశాలలో మొక్కలు నాటుతున్న దృశ్యం

సేవలే అవార్డు తెచ్చిపెట్టాయి

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు రావడం ఆనందంగా ఉంది. తోటి ఉపాధ్యాయుల సహకారంతో నిరంతరం అందించిన సేవలే నాకు ఈ అవార్డు తెచ్చిపెట్టాయి.

–సీహెచ్ వెంకటలక్ష్మి, ప్రిన్సిపాల్ మంచాల మోడల్‌స్కూల్



విద్యార్థులతో మట్టి వినాయక ప్రతిమలు తయారు చేయిస్తున్న ఉపాధ్యాయిని కేజియారాణి

ఆ 'క్రేజీ'యే రాణించేందుకు దోహదం..

అచ్యుతాపురం (అనకాపల్లి): ఉపాధ్యాయ వృత్తిపై చిన్నప్పుడే ఏర్పడిన క్రేజ్ ఇప్పుడు ఆమెను ఉత్తమ బోధకురాలిగా నిలిపింది. 7వ తరగతి చదువుతున్నప్పుడు ఇంగ్లిషు టీచర్ పాఠం చెబుతున్న తీరుతో స్ఫూర్తి పొందిన ఆ బాలిక ఇప్పుడు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. చిన్న వయసులోనే ఉత్తమ ఉపాధ్యాయురాలు కావాలని పెట్టుకున్న లక్ష్యం నెరవేరింది. బోధనలో ప్రత్యేకత, విద్యాభ్యాసం చేసేటప్పుడు అలవర్చుకున్న క్రమశిక్షణతో ఆమె భావి పౌరులను తీర్చిదిద్దుతోంది. ఆమే రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన ఎం.కేజియారాణి.

టీఎల్ఎంలకు ప్రత్యేక స్థానం...

2008 మార్చిలో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన కేజియారాణి తన బోధనలో అభ్యసన సామగ్రికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు. 2008లో నాతవరం మండలం చిన్న జగ్గంపేట ఎంపీపీ స్కూల్‌లో విధుల్లో చేరిన ఆమె తర్వాత అచ్యుతాపురం యాతపాలెంలో ఎలిమెంటరీ పాఠశాల, రాంబిల్లి మండలం గోవిందపాలెం ఎలిమెంటరీ పాఠశాలలో పని చేశారు. 2021 జనవరి 16న ప్రస్తుతం పనిచేస్తున్న నునపర్తి ప్రాథమిక పాఠశాలలో విధుల్లో చేరారు. ఇప్పటికే మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఉపాధ్యాయులకు మండల స్థాయిలో ఇచ్చే శిక్షణకు రిసోర్స్ పర్సన్‌గానూ వ్యవహరిస్తున్నారు. పాఠశాలల్లో నిర్వహించే బోధన, బోధనేతర కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ఆమె విద్యార్థులను ఆకర్షించే విధంగా బోధనాభ్యసన సామగ్రిని రూపొందిస్తున్నారు.

కల నెరవేరింది



నాకు ఏడో తరగతిలో ఇంగ్లిష్ చెప్పిన టీచర్‌ను చూసి ఎప్పటికైనా టీచర్‌ను అయ్యి అంత గొప్పగా పాఠాలు చెప్పాలని కలగన్నాను. నా కల నెరవేరింది. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపిక కావడం ఆనందంగా ఉంది.

– కేజియారాణి, నునపర్తి ప్రాథమిక పాఠశాల, అచ్యుతాపురం మండలం

మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రణాళికలు

- పరిశ్రమలకు వారంలో ఒక రోజు పవర్ హాలిడే
- వైద్య సంబంధిత పరిశ్రమలు, రైస్ మిల్లులకు మినహాయింపు
- రెండు వారాల పాటు పవర్ హాలిడే అమలు
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి



సాక్షి విశాఖపట్నం : గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏపీఈఆర్సీ ఆదేశాల మేరకు అవసరమైన ప్రణాళికలు అమలు చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. గృహ, పారిశ్రామిక రంగాలతో పాటు వ్యవసాయానికి 9 గంటల విద్యుత్తును సరఫరా చేసేందుకు విద్యుత్తు పంపిణీ సంస్థలు, ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఏర్పడిన విద్యుత్ కొరత కొంత ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రోజువారీ విద్యుత్తు సరఫరా అవసరాలకు ప్రస్తుతం 230 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరం వుండగా థర్మల్, హైడల్, గ్యాస్, పవన, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 190 మిలియన్ యూనిట్ల విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అవుతుదని ఇంకా 40 మిలియన్ యూనిట్ల వరకూ కొరత వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో గృహ, వ్యవసాయ రంగాల అవసరాలకు తగిన ప్రాధాన్యమిచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అదేవిధంగా లోటు వర్షపాతం కారణంగా వ్యవసాయ సాగు కోసం ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా, డిమాండ్ స్థితి, ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోళ్ల పరిమాణం వాటి ప్రస్తుత ధరల్ని పరిశీలించిన కమిషన్ రాష్ట్రంలోని పరిశ్రమల విద్యుత్ వినియోగంపై కొన్ని నియంత్రణ చర్యలను చేపట్టేందుకు అనుమతించినట్లు వివరించారు. ఇందులో భాగంగా సంస్థ పరిధిలో నిరంతర ప్రాసెసింగ్ పరిశ్రమలు తమ రోజువారీ విద్యుత్ వినియోగంలో 30 శాతం కాంట్రాక్టు లోడులో తగ్గించుకొనే విధంగా ఆయా పరిశ్రమలు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎండీ పృథ్వీతేజ్ సూచించారు. ఇతర పరిశ్రమలు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు ఒక షిఫ్ట్ మాత్రమే పనిచేయాలని, సాయంత్రం 6 తరువాత విద్యుత్ వినియోగానికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. వారానికి ఒకరోజు పవర్ హాలిడేను కూడా అమలు చేయాలని సూచించారు. పవర్ హాలిడేను జిల్లాల వారీగా రెగ్యులేట్ చేస్తామని, ఈ నెల 5 నుంచి 15 వరకూ రెండు వారాల పాటు పవర్ హాలిడే అమల్లో ఉంటుందని వివరించారు. ఈ నియంత్రణ చర్యల నుంచి బల్క్ డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్, వైద్య ఆక్సిజన్ ప్లాంట్లకు, రైస్ మిల్లింగ్ యూనిట్లకు సంబంధించిన పరిశ్రమలు మినహాయిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలను అతిక్రమించే పరిశ్రమలకు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. వీలైనంత త్వరగా మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ప్రయత్నిస్తామని విద్యుత్ లభ్యత మెరుగైనట్లయితే పవర్ హాలిడేను ఎత్తివేస్తామని, పారిశ్రామిక వినియోగదారులు సహకరించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై వినియోగదారులు ఏపీఈపీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912 కు ఫోన్ చేసి తెలపవచ్చని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి సూచించారు.

ఏయూ అభివృద్ధి విధానం హర్షణీయం



వీసీ ప్రసాదరెడ్డితో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సాంకేతికంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్న విధానంపై పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఏయూ రసాయన శాస్త్ర విభాగంలో చదువుకున్న 1984–86 బ్యాచ్ పీజీ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఈ బ్యాచ్ విద్యార్థులు విభాగాన్ని సందర్శించి, అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూ క్యాంపస్‌లో జరుగుతున్న నూతన ప్రాజెక్టులు, కార్యక్రమాలను తాము ఎప్పటికప్పుడు ప్రసారమాధ్యమాలు, స్నేహితుల నుంచి తెలుసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్తుకు అవసరమైన నూతన సాంకేతికతలను చేరువ చేసి నేటి తరం విద్యార్థులకు అందిస్తున్న విధానాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్‌ను సందర్శించాలని వీసీ పూర్వ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.



అపురూపం.. అమ్మ దర్శనం

గవరపాలెం నూకాంబిక అమ్మవారు ఆదివారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ మాసం మూడో ఆదివారం కావడంతో పలు రకాల పువ్వులు, తులసీదళాలతో అమ్మవారిని అలంకరించారు. దర్శనానికి భక్తులు బారులు తీరడంతో ఆలయం కిటకిటలాడింది. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

–అనకాపల్లి టౌన్

ఉత్సాహంగా ఉపాధ్యాయుల క్రీడా పోటీలు

నర్సీపట్నం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రికెట్ పోటీలను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్, మ్యూజికల్ చైర్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో విజేతలకు సోమవారం గురుపూజోత్సవం సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోపినాథ్

కార్యకర్తలు దూరం.. కోటరీకే ప్రాధాన్యం

- ఇలాగైతే పాయకరావుపేటలో మనుగడ కష్టమే
- టీడీపీ సమావేశంలో అనిత ముందే స్పష్టం చేసిన నాయకులు

నక్కపల్లి: తెలుగుదేశం పార్టీకి గ్రామాల్లో కార్యకర్తలు దూరమవుతున్నారని పలువురు సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలో కోటరీకే ప్రాధాన్యం లభిస్తోందని, ఇది కింది స్థాయిలో అసంతృప్తికి దారి తీస్తోందని వారు స్పష్టం చేశారు. 'ముఖ్యనాయకులు గ్రామాల్లోకి వెళ్తే కార్యకర్తలు రావడం లేదు.. ఎమ్మెల్యే అభ్యర్థులు, రాష్ట్ర స్థాయి నాయకుల చుట్టూ మండల స్థాయి నేతలే ఉంటున్నారు. సామాన్య కార్యకర్తలకు సరైన గుర్తింపు ఉండటం లేదు. ఇలా అయితే మనుగడ కష్టమే' అని పలువురు నేతలు నిర్మొహమాటంగా మాట్లాడారు. ఆదివారం నక్కపల్లి సుబ్బరామిరెడ్డి కల్యాణమండపంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ అధ్యక్షతన పార్టీ సమావేశం జరిగింది. 'భవిష్యత్ గ్యారంటీ, చంద్రబాబు ష్యూరిటీ' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు వంగలపూడి అనిత ముఖ్యఅతిథిగా హాజరైన ఈ సమావేశంలో సీనియర్ నాయకులు పార్టీ పరిస్థితిపై తమ అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు మాట్లాడుతూ గ్రామాల్లోకి పార్టీ కార్యక్రమం పేరుతో ముఖ్యనేతలు వెళ్లిన సందర్భంలో కార్యకర్తలు రావడం లేదన్నారు. కార్యకర్తలు, ప్రజలు మన దగ్గరకు వచ్చినపుడే ఆదరణ ఉన్నట్టుగా భావించాలన్నారు. కోటరీని పక్కన పెట్టి సామాన్య కార్యకర్తలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

మండలంలో 32 పంచాయతీలున్నాయని గ్రామానికి 10 మంది చొప్పున కూడా ఈ సమావేశానికి రాకపోవడం సరికాదన్నారు. రోజు తిరిగే వాళ్లే సమావేశాలకు వస్తున్నారని, కొత్తగా ఎవరూ రావడం లేదన్నారు. వలంటీర్ల వల్ల వైఎస్సార్‌సీపీకి మైలేజీ పెరుగుతోందన్నారు. ప్రత్యామ్నాయం గురించి ఆలోచించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే అనిత మాట్లాడుతూ భవిష్యత్ గ్యారంటీ పేరుతో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. సీనియర్ల సలహాలు సూచనలు పాటిస్తానన్నారు.

టీడీపీలో అంతర్మథనం

ఇటీవల కాలంలో టీడీపీ కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమవుతుండడంతో పార్టీలో అంతర్మథనం మొదలయింది. ఒకపక్క పార్టీలో అసమ్మతి రోజురోజుకూ చాపకింద నీరులా పెరగడం, మరోపక్క మిత్రపక్షమైన జనసేన జోరు పెంచడం, పాయకరావుపేట టికెట్ తమకే కేటాయించాలని డిమాండ్ చేయడం వంటి పరిణామాల నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు కురందాసు నూకరాజు, కొప్పిశెట్టి కొండబాబు, మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోక్సో కేసులో నిందితుడికి 14 రోజుల రిమాండ్

చోడవరం రూరల్: లైంగిక వేధింపుల కేసులో నిందితుడు వేచలపు గంగాధర్ (45)ను అరెస్టు చేసి, మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. నిందితుడిని విశాఖ సెంట్రల్ జైలుకు తరలించామన్నారు. దేవరాపల్లి మండలం వేచలం గ్రామానికి చెందిన నిందితుడు గంగాధర్ చోడవరంలోని సిటిజన్ కాలనీలో ఉంటున్నాడని తెలిపారు. అతడు బాలికను వేధింపులకు గురి చేస్తున్నట్టు శుక్రవారం ఆమె బంధువుల నుంచి ఫిర్యాదు అందడంతో అదే రోజు నిందితునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. శనివారం బాధితురాలి నుంచి వీడియో, ఆడియో వాంగ్మూలాలను సేకరించి, పకడ్బందీగా దర్యాప్తు ప్రక్రియ పూర్తి చేశాక అదేరోజు సాయంత్రం అరెస్టు చేశామన్నారు. చోడవరం మేజిస్ట్రేట్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న అనకాపల్లి మేజిస్ట్రేట్ శివకిరణ్ ఎదుట హాజరుపరచగా, రిమాండ్ విధించారన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

మునగపాక: మునగపాకకు చెందిన విద్యార్థిని అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మహమ్మద్ అలీ షరీఫ్ తెలిపారు. ఆయన విలేకరులకు ఆదివారం తెలిపిన వివరాలివి. మునగపాక మెయిన్‌రోడ్డులో నివాసం ఉంటున్న తెల్లి శ్రీనివాసరావు-నాగమణి దంపతులు స్థానికంగా హోటల్ నిర్వహిస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. ఈ దంపతుల కుమార్తె అపర్ణ ఇటీవల పదో తరగతి పూర్తి చేసింది. ఆదివారం ఉదయం తల్లిదండ్రులు ఇంటి నుంచి హోటల్ నిర్వహణకు వచ్చారు. కొంత సేపటి తరువాత అపర్ణ ఇంటి వద్ద కనిపించకపోవడంతో సమీప బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికారు. అయినా ఆమె ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళనకు గురై పోలీసులను ఆశ్రయించారు. అపర్ణ తల్లి నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోదమ్మకు భక్తుల పూజలు



మోదకొండమ్మతల్లిని దర్శించుకుంటున్న భక్తులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం ,పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగానే తరలివచ్చారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. పాడేరు ఘాట్‌లోని మోదకొండమ్మతల్లి పాదాలు గుడికి కూడా భక్తుల తాకిడి నెలకొంది. మోదమ్మకు మొక్కులు తీర్చుకుని, ఇక్కడే వంటలు చేసుకుని కుటుంబాలతో సందడి చేశారు.

విజ్ఞానానికి వివేకం తోడైతే విజయం మీదే..

- 'సాక్షి' మీడియా గ్రూపు, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్తంగా గ్రూప్-2 ఉద్యోగాలపై అవగాహన
- హాజరైన లెజెండరీ ఫ్యాకల్టీలు అబ్దుల్ కరీం, కృష్ణారెడ్డి, పాషా, హరికృష్ణ
- త్వరలో గ్రూప్-2 పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు

సాక్షి, విశాఖపట్నం: పోటీ పరీక్షల్లో రాణించాలంటే వైవిధ్యమైన ఆలోచనకు సృజనాత్మకత జోడించడం ద్వారా విజయం సాధించవచ్చని హిస్టరీ ఫ్యాకల్టీ డాక్టర్ అబ్దుల్ కరీం అన్నారు. ఎంత మంది విద్యార్థులు పోటీ పరీక్షలు రాసినా..విజ్ఞానంతో పాటు వివేకం తోడైతేనే విజయం సొంతమవుతుందని సూచించారు. రామాటాకీస్ సమీపంలోని అంబేడ్కర్ భవన్‌లో 'సాక్షి మీడియా గ్రూపు', 'హైదరాబాద్ ఆర్‌సీ ఆన్‌లైన్ ఎగ్జామ్స్ సంస్థ' సంయుక్తంగా గ్రూపు-2 పోటీ పరీక్షలపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం త్వరలో గ్రూపు-2 ద్వారా పెద్దసంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్న సమయంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించడమే లక్ష్యంగా..ఇందుకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు అవగాహన సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ సదస్సులో పోటీ పరీక్షల్లో నిష్ణాతులుగా పేరొందిన అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కరీం (హిస్టరీ), సి.హరికృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), బి.కృష్ణారెడ్డి (పాలిటీ), ఎండీ పాషా తదితరులు

గ్రూపు-2 పోటీ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కరీం మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో మన ప్రిపరేషన్ ప్రశ్నపత్రం స్థాయికంటే ఉన్నతంగా ఉండాలి. పరీక్షల స్టాండర్డ్స్ ఎప్పటికప్పుడు పెరుగుతున్న నేపథ్యంలో శిక్షణ కఠినతరంగా ఉండాలని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో శిక్షణ లభిస్తున్నప్పటికీ ఆఫ్‌లైన్‌లో పొందే శిక్షణ ద్వారా పోటీతత్వం తెలుస్తుందని పేర్కొన్నారు. పోటీతీవ్రతను దృష్టిలో ఉంచుకుని మన పక్కవాని కంటే ఒక మార్కు ఎక్కువ సాధించేలా శ్రమించేలా ఎప్పటికప్పుడు సబ్జెక్టులో అప్డేట్ అవుతూ ఉండాలన్నారు. నిష్ణాతులైన, అనుభవం కలిగిన లెజెండరీ ఫ్యాకల్టీ ఒకేచోట ఉన్న ఆర్‌సీ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందితే విజయం మీ సొంతమవుతుందన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీ ఫ్యాకల్టీ హరికృష్ణ మాట్లాడుతూ ఇతరుల అనుభవాలను తెలుసు కోవడం ద్వారా అభ్యర్థులు విజయం సాధించవచ్చున్నారు. మనం చదివే ప్రతీ సబ్జెక్టును మనచుట్టూ ఉన్న పరిస్థితులకు అనుగుణంగా అన్వయించుకోవాలన్నారు. ఎక్కువసార్లు సాధన చేయడమే విజయ రహస్యమన్నారు.

ఎకానమీ ఫ్యాకల్టీ ఎం.డి. పాషా మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో సమయం ఎంతో విలువైనదని, నోటిఫికేషన్ జారీచేసేలోగా సిలబస్ పూర్తి చేస్తే.. ప్రిపరేషన్లో ముందు ఉండాలన్నారు. ఎకానమీ సబ్జెక్టు అభ్యర్థులు విజయాన్ని డిసైడ్ చేస్తుందని, సరైన ప్రణాళిక విజయానికి బాటలు వేస్తుందన్నారు.

పాలిటీ ఫ్యాకల్టీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ..పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రశ్నలు ఎలా వస్తాయో ఊహించేలా సబ్జెక్టుపై పట్టు సాధించాలన్నారు. ఇందుకు తగ్గ విజయప్రణాళికను సిద్ధం చేసుకోవాలి సూచించారు.

టాపర్లకు నగదు బహుమతి

పోటీ పరీక్షల నిపుణులు గ్రూప్-2 పరీక్ష విధివిధానాలు, మార్కులు సులువుగా సాధించే అంశాలపై మెలకువలు, ఉదాహరణలతో వివరించారు. అనంతరం అభ్యర్థులకు ఆఫ్‌లైన్ పరీక్ష నిర్వహించి..ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన అభ్యర్థులకు నగదు బహుమతి, స్టడీ మెటీరియల్, తర్వాత స్థానాల్లో నిలిచిన 20 మందికి ప్రామాణిక స్టడీ మెటీరియల్ అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన పి.శిరీషకు, ద్వితీయ స్థానంలో కె.ప్రతాప్, తృతీయ స్థానంలో పి.పవన్ కళ్యాణ్‌లకు నగదు బహుమతి, స్టడీ మెటీరియల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో 'సాక్షి' విశాఖ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ చంద్రరావు, సాక్షి ప్రకటనల డీజీఎం శ్రీనివాసరావు, రీజినల్ ఈవెంట్ ఇన్‌చార్జి ఆర్.మారుతి, అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ప్రెసిడెంట్ కల్యాణ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హిస్టరీ ఫ్యాకల్టీ డాక్టర్ అబ్దుల్ కరీం. చిత్రంలో ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్ మొండెం కిరణ్‌కుమార్



అవగాహన సదస్సుకు హాజరైన నిరుద్యోగులు



ప్రథమ బహుమతి సాధించిన శిరీషకు నగదు బహుమతి అందిస్తున్న హిస్టరీ ఫ్యాకల్టీ అబ్దుల్ కరీం. చిత్రంలో మొండెం కిరణ్‌కుమార్

అత్యుత్తమ గ్రూప్-2 శిక్షణ అందిస్తున్నాం



వివిధ సబ్జెక్టుల్లో నిష్ణాతులైన లెజెండరీ ఫ్యాకల్టీలతో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో శిక్షణ అందిస్తున్నాం. ఇప్పటివరకూ ఆన్‌లైన్ విధానంలో వేల సంఖ్యలో అభ్యర్థులు తమ వద్ద శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించారు. హైదరాబాద్ అశోక్ నగర్‌లోని తమ ఇన్‌స్టిట్యూట్‌లో సెప్టెంబర్ 8వ తేదీ నుంచి ఆఫ్‌లైన్ గ్రూప్-2 బ్యాచ్‌లు ప్రారంభంకానున్నాయి. హైదరాబాద్ వరకూ రాలేని ప్రైవేట్ ఉద్యోగులు, గృహిణులు కోసం ఆర్‌సీ ఎగ్జామ్ మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్ కోచింగ్ అందించనున్నాం . కోచింగ్‌కు సంబంధించిన ఇతర వివరాల కోసం 89850 94499 నంబర్‌లో సంప్రదించాలి.

–మొండెం కిరణ్‌కుమార్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ చైర్మన్, హైదరాబాద్

చక్కటి మార్గనిర్దేశం..



'సాక్షి' మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ పరీక్షలో ప్రథమ బహుమతి సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది. గ్రూప్-2 పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే విద్యార్థులు తీసుకోవాల్సిన అంశాలపై నిపుణులైన ఫ్యాకల్టీ చక్కటి మార్గనిర్దేశం చేశారు. ఈ అవగాహన సదస్సు ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. పోటీ పరీక్షలకు తొలిసారిగా సిద్ధపడే అభ్యర్థులు సైతం తక్కువ సమయంలో ఎలా విజయం సాధించవచ్చో వివరించారు.

– పి.శిరీష, ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థి

ఉన్నత కొలువుల సాధనకు దిక్సూచి



ఉన్నత కొలువులు సాధించాలని సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఇలాంటి అవగాహన సదస్సులు దిక్సూచిలా ఉపయోగపడతాయి. ఈ అవగాహన కార్యక్రమంలో లక్ష్యాన్ని ఎలా సాధించాలో తెలుసుకున్నా. సాక్షి యాజమాన్యానికి ధన్యవాదాలు. ఉన్నత కొలువు సాధించాలనే నా లక్ష్యానికి ఈ సదస్సు చక్కటి మార్గనిర్దేశం చేసింది.

– ఆడారి లోకేష్, విద్యార్థి

ఆత్మవిశ్వాసం పెరిగింది



అభ్యర్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందడంతో పాటు వారిలో నిత్యం విజయకాంక్ష ఉండేలా స్ఫూర్తి కలిగించారు. ప్రణాళికబద్ధమైన సాధన విజయాన్ని సాధిస్తుందని, ఉదాహరణలతో చెప్పిన తీరు అద్భుతంగా అనిపించింది. గ్రూప్స్-2కు సన్నద్ధమవుతున్న నాలాంటి అభ్యర్థులకు ×సాక్షి℈ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవగాహన సదస్సు ఓ వరం లాంటిది.

– కొత్తి నాగమణి, వడ్లపూడి, విద్యార్థి

జిల్లా శిష్టకరణ సమితి అధ్యక్షునిగా సురేంద్రనాథ్ బెనర్జీ

అనకాపల్లి టౌన్: జిల్లా శిష్టకరణ సమితి అధ్యక్షుడిగా బగ్గాం సురేంద్రనాథ్ బెనర్జీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కరణాలవీధిలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి జగ్గుమంత్రి రమాదేవి, కోశాధికారిగా శేఖరమంత్రి శంకరరావు, ఉపాధ్యక్షులుగా శేఖరమంత్రి వి.ఎస్. పట్నాయక్, రాజమహంతి రాంబాబు, పోలాకి సునీత, జక్కువ వెంకట గోపినాధరావుపట్నాయక్, పట్నాయకుని సోమశేఖర్, సహాయ కార్యదర్శులుగా పక్కి రమేష్, సదాశివుని మన్మథరావు, కంఠిమంత్రి లక్ష్మణరావు, డబ్బీరు విష్ణుమూర్తి, రొంపల్లి కిరణ్, ఆడిటర్‌గా భాసూరు ఉమామహేశ్వరరావు, లీగల్ అడ్వైజర్‌గా పోలాకి శ్రీనివాస పట్నాయక్, మీడియా కోఆర్డినేటర్‌గా నాగుమంత్రి ఉమామహేశ్వరరావు, మరో 14 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సురేంద్రనాథ్ బెనర్జీ మాట్లాడుతూ నూతన కమిటీ పదవీ కాలం రెండు సంవత్సరాలు ఉంటుందన్నారు.

మహిళ మెడలో బంగారు నగలు చోరీ

నాతవరం: మహిళ మెడలో బంగారు నగలను గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించారు. మండలంలోని గన్నవరంలో ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక హెచ్‌సీ నాగరాజు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన లగుడు రమణమ్మ ఉదయం తన పొలంలో పని నిమిత్తం వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కొంత సమాచారం అడగ్గా, వారికి ఆమె బదులిచ్చింది. తర్వాత పొలంలోకి వెళ్తుండగా వెనుక వచ్చి రమణమ్మను బలంగా తోసి మెడలో రెండున్నరల తులాల పుస్తెలతాడు, వస్తువులు ఎత్తుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ఎస్పీ ఆదేశాలతో పేకాట శిబిరంపై దాడి

నలుగురిపై కేసు నమోదు

యలమంచిలి: స్థానిక మున్సిపాలిటీ పరిధి వెంకటాపురం గ్రామానికి సమీప మామిడితోటలో పేకాట శిబిరంపై యలమంచిలి రూరల్ పోలీసులు ఆదివారం మధ్యాహ్నం దాడులు నిర్వహించారు. ఇక్కడకు ఇతర ప్రాంతాల నుంచి కార్లు, ద్విచక్ర వాహనాలపై వచ్చిన 200 మంది వరకు బహిరంగంగా మద్యం సేవించడంతోపాటు జూదం ఆడుతున్నట్లు కొందరు ఎస్పీ మురళీకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు యలమంచిలి రూరల్ ఎస్సై సన్నిబాబు తన సిబ్బందితో జూద శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేశారు. అయితే పోలీసుల రాకను ముందే గమనించిన కొంతమంది అక్కడ నుంచి పరారయ్యారు. పట్టుబడిన వ్యక్తుల పేర్లు చెప్పడానికి పోలీసులు నిరాకరించారు.

విషాహారం తిని 9 మేకల మృతి

పెంపకందారుడికి రూ. 1.80 లక్షల నష్టం



మేకల కళేబరాలు

చీడికాడ: విషాహారం తిని తొమ్మిది మేకలు మృతి చెందిన సంఘటన మండలంలోని అర్జునగిరిలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చెలిబోయిన ఈశ్వరరావుకు చిన్నా పెద్దా కలిపి 30 మేకలు ఉన్నాయి. వాటిపైనే ఆయన కుటుంబం జీవనాధారంగా బతుకుతోంది. ఉదయం వాటికి ఈశ్వరరావు కుమారుడు ఎప్పటి మాదిరిగానే బకెట్లో కుడితిని పెద్ద మేకలకు పెట్టాడు. అవి తాగిన గంట తర్వాత వాటి పొట్టలు పొంగి నోటి వెంట నురుగులు కక్కుతూ ఒకదాని వెంట మరొకటి మృతి చెందాయి. ఈ సమాచారం పెదగోగాడ పశువైద్యాధికారి గాయిత్రిదేవికి ఇవ్వడంతో సిబ్బందితో వచ్చి మిగిలిన మేకలకు చికిత్సలు అందించారు. ఇదిలా ఉంటే పెంపకందారుడు తన మేకలకు బీమా చేయించకపోవడంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం అందించలేమని పశువైద్యాధికారి తెలిపారు. దీంతో బాధితుడికి రూ. 1.80 లక్షలు నష్టపోయినట్లు సర్పంచ్ బి.రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డెక్కిన వసతి గృహ విద్యార్థులు

ప్రభుత్వ విప్ ధర్మశ్రీ హామీతో నిరసన విరమణ



రోడ్డుపైనే వంటా వార్పు చేస్తున్న విద్యార్థులు

చోడవరం రూరల్: వసతి గృహంలో వారం రోజులుగా వంట పనివారు లేక ఆకలి బాధలు భరించలేక విద్యార్థులు రోడ్డెక్కారు. ఆదివారం చోడవరం -అనకాపల్లి రోడ్డుపైనే వంటా వార్పుతో తమ నిరసన వ్యక్తం చేశారు. చోడవరం మండలం గోవాడలో గిరిజన బాలుర సంక్షేమ వసతి గృహంలో ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పాలిటెక్నిక్, బీఈడీ విద్యాభ్యాసం చేస్తున్న 150 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఇక్కడ పూర్తి స్థాయి వార్డెన్ లేకపోవడంతో విద్యార్థుల ఆలనాపాలనా కరువైంది. దీంతోపాటు వారం రోజులుగా వంట పనివారు లేకపోవడంతో ఇన్‌చార్జి వార్డెన్ కరీముద్దీన్ ఏదో ఒకరిద్దరితో నెట్టుకొచ్చారు. నాలుగు రోజుల నుంచి విద్యార్థులపై వంట భారం వేశారు. దాంతో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, కోశాధికారులు ఎస్.వి.రమణ, తరుణ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీ, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మిల నేతృత్వంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. దీంతో రోడ్డుపై ట్రాఫిక్ ఏర్పడిన విషయం తెలుసుకున్న చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు, ఎస్ఐ బి.అప్పలనాయుడు తమ సిబ్బందితో అక్కడకు చేరుకుని విద్యార్థులను సముదాయించారు. ఇన్‌చార్జి వార్డెన్‌ను రప్పించి విషయం తెలుసుకున్నారు. అదే సమయంలో అనకాపల్లి జిల్లా అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శిరీష సైతం అక్కడికి చేరుకుని వార్డెన్ నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో చోడవరం ఏఎంసీ చైర్మన్ ఏడువాక వెంకట సత్యారావు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో ఫోన్లో మాట్లాడించారు. సమస్యను తొందర్లోనే పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ హామీ ఇవ్వడంతో విద్యార్థులు నిరసనను విరమించారు.

ట్రావెల్ బస్సు ఢీకొని రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ దుర్మరణం



మృతి చెందిన వీర వెంకట సుబ్బారావు

పాయకరావుపేట: స్థానిక గాంధీ నామవరం సెంటర్ వద్ద బస్సు ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ బి.జోగారావు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలివి. పాయకరావుపేటకు చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ యర్రా వీరవెంకట సుబ్బారావు (71) తన మనవడు సుహాసన్‌తో కలిసి స్కూటర్‌పై గాంధీ నామవరం మటన్ కొనుగోలుకు వెళ్లారు. తిరిగి వస్తూ హైవేపై యూటర్న్ తీసుకుంటున్న సమయంలో విశాఖ వైపు అతివేగంగా ప్రయాణిస్తున్న ప్రైవేట్ ట్రావెల్ మోజో బస్సు బలంగా ఢీ కొట్టింది. వెంటనే తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో సుబ్బారావు మృతి చెందారు. గాయాలపాలైన మనవడు సహాసన్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జోగారావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అనకాపల్లిటౌన్: రోడ్డు ప్రమాదంలో ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామీణ ఎస్ఐ సీహెచ్.నర్సింగరావు వివరాల ప్రకారం.. అనకాపల్లి నుంచి బైక్‌పై విశాఖ వైపు వెళ్తున్న గొన్నాబత్తుల ఆదినారాయణను కొప్పాక బ్రిడ్జిపై ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో బైకిస్ట్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

పల్లెల్లో చోరుల భయం

- అనుమానాస్పదంగా అగంతకులు
- పింఛను సొమ్ము దోపిడీపై ముమ్మర దర్యాప్తు
- సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్న పోలీసులు



రాంగ్ రూట్లో మాస్కులు ధరించి వెళ్తున్నట్లుగా సీసీఫుటేజీలో గుర్తించిన పోలీసులు

నక్కపల్లి: ప్రశాంతతకు నిలయమైన పల్లెల్లో వరుస చోరీలు కలకలం సృష్టిస్తున్నాయి. ఇటీవల కాలంలో జన సంచారం లేని ప్రాంతాలతోపాటు రాత్రిళ్లు గ్రామ వీధుల్లోనూ అగంతకులు హల్ చల్ చేస్తుండటంతో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజుల క్రితం చోటు చేసుకున్న జానకయ్యపేట ఘటన దీనికి బలం చేకూరుస్తోంది. నక్కపల్లి ఐవోబీ బ్యాంకు నుంచి పింఛనుదారులకు చెల్లించేందుకు జానకయ్యపేట సచివాలయ సిబ్బంది తీసుకెళ్తున్న రూ.13.78 లక్షలను నిత్యం హెటిరో కంపెనీ ఉద్యోగులు సంచరించే రోడ్డులో ఆటకాయించి కళ్లలో కారం కొట్టి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయిన విషయం విదితమే. పట్టపగలే చోటు చేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. ఇద్దరు సచివాలయ ఉద్యోగుల వద్ద ఉన్నది నగదేనని వారికి ఎలా తెలిసిందనే ప్రశ్నార్థకంగా మారింది. వారు బ్యాంకులో డ్రా చేస్తున్న విషయాన్ని ముందుగానే గుర్తించి పథకం ప్రకారం మాటు వేసారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

పక్కా ప్రణాళికతోనే చోరీ...

ఈ ఘటనపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. నక్కపల్లి, అడ్డురోడ్డు, కోటవురట్ల, పెద గుమ్ములూరు, మాకవారిపాలెం తదితర ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. సచివాలయ సిబ్బంది తెలిపిన విధంగా రెండు చోట్ల సీసీఫుటేజీలు పరిశీలించగా, దోపిడీదారులు కనిపించినట్లు సమాచారం. వారు హెటిరో రోడ్డులో దోపిడీకి పాల్పడి రాంగ్ రూట్లో అడ్డురోడ్డు వైపు వెళ్లినట్లు తెలుస్తోంది. వారు ఉపయోగించిన మోటారు సైకిల్‌కు నంబరు ప్లేట్ లేకపోవడం, ఒకరు మాస్క్ ధరించడం, మరొకరు హెల్మెట్ పెట్టుకుని ఉండటంతో గుర్తించడం కష్టతరమవుతోంది. బ్యాంకులో నగదు డ్రా చేసే సమయంలో అపరిచిత వ్యక్తులు ఎవరైనా ఉన్నారా అనే విషయాలు తెలుసుకునేందుకు అక్కడ సీసీఫుటేజీలు పోలీసులు పరిశీలిస్తున్నారు. హెటో రోడ్డులో ప్రవేశ ద్వారం వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో పక్కా ప్రణాళికతోనే ఈ రోడ్డునే ఎంచుకున్నారని తెలుస్తోంది. ముమ్మాటికీ ఇది అనుభవంతో కూడిన చోరుల పనే అని భావిస్తున్నారు.

ఇటీవల ఘటనల్లో కొన్ని..

- ఇటీవల ఉద్దండపురంలో ఒక మహిళ రమణయ్యపేట వైపు వెళ్తున్న వ్యక్తిని బైక్ ఎక్కించాలని కోరడంతో అతను కొద్ది దూరం తీసుకెళ్లాక ఆమెను బెదిరించి మెడలో ఉన్న నాలుగు తులాల బంగా రు ఆభరణాలు, పుస్తెల తాడుతో ఉడాయించాడు.
- రెండు నెలల క్రితం నక్కపల్లిలో రెండు బైక్‌లు చోరీకి గురయ్యాయి.
- దేవవరం జంక్షన్‌లో పార్క్ చేసిన ఒక బైక్ చోరీకి గురయింది. ఇదే గ్రామంలో కొద్ది రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు సచివాలయం సమీపంలో అర్ధరాత్రి సమయంలో ఓ ఇంట్లో చొరబడేందుకు ప్రయత్నించగా ఇంటి వారు అప్రమత్తం కావడంతో ఉడాయించారు.

అపరిచిత వ్యక్తులపై అప్రమత్తత

పట్టణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ఒంటరి మహిళలు, వ్యక్తులనే టార్గెట్ చేస్తున్నారన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల సంచారం, మోటారు సైకిళ్లు, దోపిడీలపై పోలీసులు ప్రత్యేక దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

ముమ్మరంగా దర్యాప్తు : ఎస్ఐ

అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ శిరీష తెలిపారు. వారిని పట్టుకుని నిలదీయాలని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. సచివాలయ సిబ్బంది నుంచి నగదు దోపిడీ చేసిన వ్యవహారంపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

7న హరేకృష్ణ సత్సంగం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

అనకాపల్లిటౌన్: స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రం రహదారిలోని ఉప్పల చంద్రశేఖర రావు కల్యాణమండపంలో ఈనెల 7న శ్రీ కృష్ణ జన్మాష్టమి మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు హరేకృష్ణ సత్సంగ మందిరం అధ్యక్షుడు దుర్లబ కృష్ణప్రేమదాస్ ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఉట్టి ఉత్సవాన్ని జరుపుతాయని చెప్పారు. మధ్యాహ్నం 1500 మందికి అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 5 గంటలకు తలసిపూజ, 5.30 గంటలకు సంధ్యాహారతి, 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 7 గంటలకు శ్రీ రాధాకృష్ణులకు పంచామృత, ఫలరసాలతో సహస్ర కలశాభిషేకం, రాత్రి 9గంటలకు ఊంజల సేవ అనంతరం మహా ప్రసాద వితరణ చేయనున్నట్టు ఆయన తెలిపారు.

నేడు జి.భీమవరంలో గడప గడపకు..

కశింకోట: మండలంలోని జి.భీమవరంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి పత్రాలను పంపిణీ చేయనున్నారని, ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తారని చెప్పారు.అధికారులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పట్టాలు మంజూరు చేయాలని వినతి

కశింకోట: మండలంలోని తేగాడ గ్రామం వద్ద సర్వే నంబర్ 103లో ఉన్న 33 ఎకరాల ప్రభుత్వ భూమికి పట్టాలు మంజూరు చేసి తమకు న్యాయం చేయాలని యాదవులు అధికారులను కోరారు. ఈమేరకు మాజీ సర్పంచ్ సర్వసిద్ధి తాతారావు ఆధ్వర్యంలో ఆదివారం అక్కడ నిరసన తెలిపారు. సర్వే నంబర్ 103లో ఉన్న 33 ఎకరాల్లో 52 కుటుంబాలకు చెందిన తాము తాతల కాలం నుంచి గొర్రెలు, మేకలు మేపుకుంటున్నామన్నారు. తమకు జీవనాధారమైన ఈ భూమి అన్యాక్రాంతం కాకుండా తమకు పట్టాలిచ్చి న్యాయం చేయాలని అధికారులను కోరారు

లోపూడిలో అంబేడ్కర్, రంగా విగ్రహాల ఆవిష్కరణ

బుచ్చెయ్యపేట: లోపూడి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, వంగవీటి రంగా విగ్రహాలను ఆదివారం ఆవిష్కరించారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షురాలు మంచా నాగమల్లేశ్వరి, రంగా మిత్ర మండలి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కె.బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శని వారం 240 బెల్లం దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,300	4,410
రెండో రకం	3,980	4,050
మూడోరకం	3,800	3,960

అనకాపల్లి సినిమాలు

మిస్టిక్ (ఉదయం, సాయంత్రం)	
బేబి (మ్యాట్నీ, రాత్రి)	:రాజా
ఏం చేస్తున్నావ్	:సత్యనారాయణ స్క్రీన్-1
ద ఈక్విలైజర్ 3	:సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	:షిర్డిసాయి
ఖుషి	:పర్తిసాయి
బెదురులంక 2012	:వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	:శ్రీసత్య
ఖుషి	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 23 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-1 యూనిట్, బి పాజిటివ్-10 యూనిట్లు, ఒ పాజిటివ్ 10 యూనిట్లు, ఒ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 317 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 344 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

అభివృద్ధి పథంలో జి.భీమవరం



వైఎస్సార్ హెల్త్ క్లినిక్

- సుమారు రూ.1.60 కోట్లతో పనులు
- రహదారులు, డ్రైనేజీ నిర్మాణం
- ఇంటింటికీ కుళాయిలు
- సచివాలయం, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్ భవనాలు ప్రారంభానికి సిద్ధం



నాడు-నేడులో అభివృద్ధి చేసిన పాఠశాల



జి.భీమవరంలో ప్రారంభోత్సవానికి సిద్ధమైన సచివాలయం, పంచాయతీ భవనం



గ్రామంలో ఏర్పాటుచేసిన కుళాయి

కశింకోట: మండలంలోని జి.భీమవరంలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. కుగ్రామమైన ఈ పంచాయతీలో రూ.1.60 కోట్లతో పనులు నిర్వహిస్తున్నారు. జి.భీమవరం, శివారు సింగవరంతో కలుపుకొంటే దాదాపు 1600 మంది జనాభా ఉన్నారు. జి.భీమవరంలో మాత్రం 1100 మంది జనాభా ఉన్నారు. గ్రామంలో రూ.1.40 కోట్ల వ్యయంతో ఇప్పటికే పూర్తి చేసిన పలు పనులు ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సోమవారం వీటిని ప్రారంభించనున్నారు. గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వ హయాం నుంచి పంచాయతీ కార్యాలయానికి సొంత భవనం లేదు. ఇప్పుడు జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు రూ.16 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణం పూర్తి చేశారు. ఈ భవనంపైనే రూ.25 లక్షలతో సచివాయలం నిర్మించారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని రూ.24.80 లక్షలతో అందంగా నిర్మించారు. అక్కడి ప్రాథకోన్నత పాఠశాలను రూ.18.30 లక్షలతో నాడు-నేడు కింద అభివృద్ధి చేశారు. తరగతి గదుల వరకు రోడ్డు నిర్మించడంతో పాటు గదులకు అందంగా రంగులు, బొమ్మలు వేశారు. ప్రవేశ ద్వారాన్ని కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తీర్చిదిద్దారు. నూతనంగా సామూహిక మరుగుదొడ్లను నిర్మించారు.

ఇంటింటికీ కుళాయిలు

జల జీవన్ మిషన్ కింద రూ.14 లక్షలు వెచ్చించి 130 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. నీటి సమస్య తలెత్తకుండా రూ.లక్షన్నరతో బోరు, మోటారు అదనంగా ఏర్పాటు చేశారు. రూ.20 లక్షలతో గ్రామంలోని ప్రధాన వీధుల్లో సిమెంటు రోడ్లు, రూ.10 లక్షలతో డ్రైనేజీలు నిర్మించారు. రూ.4.50 లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ.70 వేలతో మదుం, రూ.3 లక్షల స్వచ్ఛ భారత్ మిషన్ నిధులతో సామూహిక మరుగుదొడ్లు నిర్మించారు. ఈ పనులను మంత్రితో ప్రారంభించడానికి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు.వైఎస్సార్ జగనన్న గృహ నిర్మాణ లే-అవుట్‌ను ఏర్పాటు చేసి 90 మంది లబ్ధిదారులకు గ్రామ సమీపంలో ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. వాటి నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్ర భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇలా మారుమూల చిన్న గ్రామంలో కోట్ల రూపాయల వ్యయంతో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరగడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభోత్సవానికి చర్యలు



జి.భీమవరం గ్రామంలో రూ.1.40 కోట్ల వ్యయంతో పూర్తిచేసిన అభివృద్ధి పనులను సోమవారం రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో ప్రారంభించడానికి సన్నాహాలు చేశాం. సచివాలయ, పంచాయతీ కార్యాలయ భవనం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు, ఇంటింటికీ కుళాయిలు, పాఠశాలలో నాడు-నేడు అభివృద్ధిపనులు, సిమెంట్ రోడ్డు, మురికి కాలువలు వగైరా ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేశాం.

-బి. చిన్నోడు, పంచాయతీ కార్యదర్శి, జి.భీమవరం

పంట నమోదుతో ప్రయోజనాలివీ..

- ప్రభుత్వ సాయానికి ఈ క్రాప్ ప్రామాణికం
- జోరుగా ఈ క్రాప్ నమోదు ప్రక్రియ

వైఎస్సార్ ఉచిత పంటల బీమా, పంట నష్ట పరిహారం, ఎరువులు, ధాన్యం కొనుగోలు ఇలా ప్రతి ప్రభుత్వ సాయం అందాలంటే రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి. ప్రస్తుతం ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ జోరుగా సాగుతోంది.



నారాయణపురం సమీపంలో వరినాట్లు



ఈ క్రాప్ నమోదు చేస్తున్న వీఏఏ ప్రశాంతి

రాంబిల్లి : ఈ క్రాప్ నమోదుతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి. వైఎస్సార్ ఉచిత పంటల బీమా, పంట నష్ట పరిహారం, ఎరువులు, ధాన్యం కొనుగోలు ఇలా ప్రతి ప్రభుత్వ సాయం అందాలంటే రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. రైతులు ఈ క్రాప్ నమోదు ప్రాధాన్యతను గుర్తించాలని అధికారులు కోరుతున్నారు. ప్రస్తుతం వరి నాట్లు పనులు జోరుగా సాగుతున్నాయి. వరినాట్లు పనులు పూర్తి చేసిన రైతులు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి. ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడడం, శారద నదిలో నీరు తక్కువగా ప్రవహించడంతో వరినాట్లు ఆలస్యమయ్యాయి. అంతేకాకుండా వారం రోజుల క్రితం వరకూ కేవలం 25 శాతమే వరినాట్లు పడ్డాయి. ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాంబిల్లి మండలంలో సుమారు 7500 ఎకరాల్లో వరినాట్లు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. అయితే వర్షంపై ఆధారపడిన పొలాల్లో నాట్లు వేసే అవకాశాలు కనిపించడం లేదు. శారదా నదిలో నీరు ఆశాజనకంగా ప్రవహిస్తుండడంతో శారదా నదీ పరివాహక ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో వరినాట్లు పడే అవకాశాలున్నాయి. దిమిలి, మామిడివాడ, కట్టుబోలు, రజాల, కుమ్మరాపల్లి, మర్రిపాలెం , మురకాడ తదితర గ్రామాల్లో ఇప్పటికే 40 శాతం వరినాట్లు పడ్డాయి. వరినాట్లు పూర్తయిన పొలాలను పరిశీలించి సంబంధిత రైతుల వివరాలతో ఆర్‌బీకే వీఏఏలు ఈ క్రాప్ నమోదు చేస్తున్నారు. రైతులు ఆర్‌బీకేలను సంప్రదిస్తే సంబంధిత వీఏఏలు క్షేత్ర స్థాయి పరిశీలన చేసి ఈ క్రాప్ నమోదు చేస్తారు. ఈ విషయంలో రైతులు ఎంత మాత్రం అశ్రద్ధ చేయకూడదని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

25 శాతం మేర ఈ-క్రాప్ నమోదు పూర్తి

మండలంలో వరినాట్లు వేసిన గ్రామాల్లో ఈ క్రాప్ నమోదు ప్రక్రియ ముమ్మరంగా జరుగుతుంది. రైతులు ఈ కార్యక్రమం ప్రాధాన్యం గుర్తించాలి. అశ్రద్ధ చేయకుండా సకాలంలో ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించి ఈ పంట నమోదు చేయించుకోవాలి. ఇప్పటివరకు మండలంలో 25 శాతం మేర ఈ క్రాప్ నమోదు పూర్తయింది.

– సి.సుమంత, ఏవో రాంబిల్లి మండలం

జంగిల్ క్లియరెన్స్ చేయించరూ..

కోటవురట్ల : రహదారులను మూసేసిన పిచ్చిమొక్కలతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రహదారుల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. చాలా కాలంగా జంగిల్ క్లియరెన్స్ లేకపోవడంతో రహదారులను కమ్మేశాయి. మండలంలోని పాతరోడ్డు నుంచి చౌడువాడ వెళ్లే రోడ్డుతో పాటు నర్సీపట్నం-రేవుపోలవరం రహదారి, లింగాపురం-కొడవటిపూడి రహదారి, రాజుపేట, అన్నవరం రహదారుల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. మలుపుల్లో ఎదుట వచ్చే వాహనాలు కనిపించక వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయించాలని పలువురు కోరుతున్నారు.



పాతరోడ్డు జంక్షన్‌లో రహదారిని కమ్మేసిన పిచ్చిమొక్కలు

వలంటీరు సేవాభావం



ఏలూరులో ఉంటున్న వృద్ధురాలు సన్నమ్మకు పింఛన్ అందజేస్తున్న గంటవానిపాలెం వలంటీర్ ముసిలినాయుడు

మునగపాక : వలంటీర్లు తమ సేవా భావాన్ని చాటి చెబుతున్నారు. గంటవానిపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు రాయి సన్యాసమ్మ కాలి నొప్పులతో బాధపడుతూ బంధువుల ఇంటి వద్ద ఉంటున్నారు. దీంతో వలంటీర్ కోన పెద ముసిలినాయుడు ఆదివారం ఏలూరుకు సొంత ఖర్చులతో వెళ్లి సెప్టెంబర్ నెలకు సంబంధించిన పింఛన్ సొమ్మును అందజేశాడు. దీంతో గ్రామస్తులు అతనిని అభినందించారు.

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన

మాకవరపాలెం: సంస్కృతి, సంప్రదాయాలపై పిల్లలకు అవగాహన కల్పిస్తున్నట్టు సమరసత సేవా ఫౌండేషన్ ప్రచారకర్త రత్నమాల తెలిపారు. స్థానిక రామాలయంలో ఆదివారం నుంచి పిల్లల్లో భక్తిభావం పెంచేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాభారతంలోని శ్లోకాలను నేర్పించడంతోపాటు సంస్కృతి, సంప్రదాయాలపై వివరించారు. ప్రతి ఆదివారం పిల్లలకు భక్తి భావం పెంపొందించే దిశగా కార్యక్రమాలు చేపడతామని రత్నమాల తెలిపారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పిల్లలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ఎస్.రాయవరం: కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో 2008-09 సంవత్సరాల్లో 10 వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకుని అలనాటి తీపి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. పాఠశాల దశ నుంచి వెళ్లాక 15 ఏళ్ల తరువాత తామంతా కలుసుకోవడం మంచి అనుభూతిని ఇచ్చిందని చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గడిపిన పూర్వ విద్యార్థులు తాము స్థిరపడ్డ రంగాలపై చర్చించుకున్నారు. తమతో చదువుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడే వారిని ఆదుకోవాలని స్నేహితులు తీర్మానించారు.

జగనన్న పాలవెల్లువతో ఆర్థికాభివృద్ధి

మునగపాక : జగనన్న పాలవెల్లువ ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందజేస్తారని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు అన్నారు. వాడ్రాపల్లిలో ఆదివారం అమూల్ పాడిరైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి పశువుల కొనుగోలుకు రైతులకు అవసరమయ్యే రుణ సదుపాయం కల్పిస్తున్నారని, మహిళలు ఆర్థికంగా నిలబడేందుకు అమూల్ సేవలు దోహదపడతాయని అన్నారు.

షెడ్ల నిర్మాణానికి ఎంపీ నిధులు



రూఫింగ్ షెడ్ల ఏర్పాటుకు స్థల పరిశీలన

మునగపాక : తోటాడ శివారు గవర్ల అనకాపల్లి రామకోవెల దరి , తోటాడ రాజీవ్‌కాలనీలోని దుర్గాలమ్మ తల్లి ఆలయాల ఎదుట రూఫింగ్ షెడ్ల ఏర్పాటుకు ఆదివారం స్థల పరిశీలనలు జరిగాయి. ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు సిఫార్సుతో అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి సంబంధిత షెడ్ల నిర్మాణాలకు రూ.20 లక్షలు మంజూరు చేశారు. నిర్మాణ పనుల ప్రారంభంపై సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు, కాండ్రేగుల వెంకట శివ, షేక్ ఇస్మాయిల్ తదితరులు పంచాయతీరాజ్ డీఈ మునిశేఖర్‌తో చర్చించారు.

మట్టి గణపతిని పూజించాలి

అనకాపల్లిటౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఈనెల 18వ తేదీన జరిగే వినాయక చవితి నాడు అందరూ వారివారి గృహాల్లోను, వీధులలో మట్టిగణపతిని ప్రతిష్టించి, పూజించాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమారస్వామి కోరారు. స్థానిక నెహ్రూచౌక్‌లో ఆదివారం మట్టివినాయకులనే పూజించాలని కోరుతూ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది మట్టి గణపతిని పూజించాలని నినాదంతో ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పి.సోమశేఖర్ పట్నాయక్, ఆళ్ల నాగేశ్వరరావు, ఎస్.వి.కృష్ణ, కొప్పాక శంకరరావు, ఎం.మహేష్, ఆడారి శ్రీనివాసరావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మట్టివినాయకున్ని పూజించాలని నెహ్రూచౌక్‌లో ప్రచారం చేస్తున్న ఆడారి కుమారస్వామి

సీపీఎం కాగడాల ర్యాలీ

అనకాపలి రూరల్: దేశం,రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యతో యువత సతమతమవుతున్నారని, వెంటనే ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం నాయకులు ఆదివారం రాత్రి పట్టణంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు.స్థానిక రింగు రోడ్డు నుంచి నెహ్రూ చౌక్ కూడలి వరకు కాగడాలు, బ్యానర్లు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కర్యదర్శి కె.లోకనాథం , సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు,గంటా శ్రీరామ్,అల్లు రాజు,సీనియర్ నాయకులు సీహెచ్.శివాజీ,ఎస్ నాగరమణ,జి.సురేష్, కె.సుజాత,చలపతి,నూక అప్పారావు,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

వామ్మో తేనెటీగలు

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం జీవీఎంసీ -1 సచివాలయంపై కల్యాణమండపాన్ని ఆనుకొని పెద్ద చెట్టుకు తేనెటీగలు పట్టుపెట్టాయి. ఇది చూసిన ప్రతి ఒక్కరూ ఆహా తేనెపట్టు అంటూ మురిసిపోతున్నా మరో పక్క తేనెటీగల దాడిని ఊహించుకుని అమ్మో అంటున్నారు. అల్లరి పిల్లలు రాళ్లువిసిరితే కలిగే అనర్ధాన్ని తలచుకుని భయపడుతున్నారు. ఆపక్కనే సచివాలయం, ఆపైన కల్యాణమండపం ఉంది. ఇక్కడి కల్యాణమండపంలో పలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు రాష్ట్ర మంత్రితోపాటు కలెక్టర్, పలు శాఖల అధికారులు హాజరవుతుంటారు. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో భారీవృక్షానికి తేనెపట్టు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



గాంధీనగరం జీవీఎంసీ-1 సచివాలయం, కల్యాణ మండపం వద్ద చెట్టుపై తేనెపట్టు

అంతర పంటలతో అదనపు ఆదాయం

- మెట్ట ప్రాంతాల్లో అధికంగా సాగు

కె.కోటపాడు: అంతర పంటల సాగుపై పలు గ్రామాల్లో రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో మెట్ట ప్రాంతాల్లో విస్తారంగా మామిడి తోటలు ఉన్నాయి. మామిడి కాపు ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఉంటోంది. అనంతరం ఈ తోటల మధ్య ఖాళీ ప్రదేశాల్లో కూరగాయల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ విధానం ద్వారా తక్కువ కాలవ్యవధిలో దిగుబడి వచ్చే కాయగూరల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నారు. ప్రధానంగా మండలంలో పాతవలస, పింద్రంగి, మర్రివలస, గొట్లాం, సూదివలస, బొట్టవానిపాలెం, కె.సంతపాలెం గ్రామాల్లోని మామిడి తోటల్లో బరబాటి, బెండ, వంగ, టమాటా పంటలను సాగు చేస్తున్నారు.



సూదివలసలో మామిడిలో అంతర పంటగా బరబాటి సాగు

హెచ్చరిక బోర్డు పెట్టినా బేఖాతరు

- ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇళ్ల నిర్మాణం



ప్రభుత్వ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్న దృశ్యం

గొలుగొండ: గుండిపాల గ్రామ రెవెన్యూ పరిధి 123 సర్వే నంబర్‌లో గోర్జు భూములను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేయడంపై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ ప్రభుత్వ భూములను నలుగురు వ్యక్తులు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేయడంపై ఇప్పటికే స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ భూములు ప్రభుత్వానికి చెందినవిగా మండల రెవెన్యూ అధికారులు ఆర్నెల్ల క్రితం బోర్డులు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ అక్రమ నిర్మాణాలు ఆపలేదు. దీనిపై గ్రామ రెవెన్యూ అధికారి నారాయణమూర్తిని సంప్రదించగా సదరు భూముల్లో ఎటువంటి కట్టడాలు చేయొద్దని, ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. వెంటనే చర్యలు తీసుకుని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

యలమంచిలి : రక్తదానం ప్రాణదానంతో సమానం అని ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ బంగారు శెట్టి అన్నారు. ఆదివారం యలమంచిలి వాసవీ కళ్యాణ మండపంలో నవభారత్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో 40 మంది సభ్యులు రక్తదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో తీవ్రగాయాలు పాలవడం, రక్తస్రావం జరగడం వల్ల సకాలంలో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఇటువంటి తరుణంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. రక్త నిల్వలను ఏఎస్‌రాజా బ్లడ్‌బ్యాంక్‌కు సిబ్బందితో తరలించారు. ఈ కార్యక్రమంలో కె.పరమేష్, నారాయణమూర్తి, ఏపి జగన్నాథం, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దాతలు

కంటి శస్త్రచికిత్సలకు 23 మంది ఎంపిక

నాతవరం: నేత్ర వైద్య శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మంకు రమణమ్మ తెలిపారు. మర్రిపాలెంలో కాకినాడకు చెందిన అంజు ఇంటర్నేషనల్ కంటి ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరంలో వైద్యుడు తేజ 126 మంది రోగులను పరీక్షించి, వారిలో 23 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. 23 మందిని రెండు రోజుల్లో కాకినాడ ఆస్పత్రికి బస్సులో తరలించి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని సర్పంచ్ తెలిపారు. గ్రామంలో ప్రజోపయోగ కార్యక్రమాల నిర్వహణకు యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మంకు సాంబమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.